# కేసీఆర్ చేతిలోనే తెలంగాణ భవిష్యత్

- ఘోష్ నివేదికపై హైకోర్టు తీర్పు రేవంత్ సర్కార్‌కు చెంప పెట్టు
- సిరిసిల్ల తెలంగాణ భవన్ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి




**ప్రజానావ, సిరిసిల్ల :** తెలంగాణ భవిష్యత్తు కేసీఆర్ చేతిలోనే ఉన్నదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జగిత్యాల మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి జీవన్ రెడ్డి వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీలో చేరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన జీవన్ రెడ్డి గురువారం సిరిసిల్ల జిల్లా కేంద్రానికి తొలిసారిగా వచ్చిన సందర్భంగా తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి మాట్లాడుతూ కుట్రపూరితంగా అపోహలు సృష్టించిన, పీసీఘోష్ నివేదిక కు వ్యతిరేకంగా రాష్ట్ర హైకోర్టు తీర్పు రేవంత్ సర్కార్ కు చెంపపెట్టు అని దుయ్య బట్టారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో విస్తృత చర్చల తరువాత తుమ్మిడిహట్టి తోపాటు, తరువాత మేడిగడ్డ వద్ద కూడా బ్యారేజి నిర్మాణానికి నిర్ణయించారని, గోదావరి జలాలను కూడా వాడుకునేందుకు మేడిగడ్డ వద్ద బ్యారేజి నిర్మించారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే కేవలం మేడిగడ్డ కాదు, అందులో వంద కాంపోనెంట్స్ ఉన్నాయి. ప్రపంచ స్థాయి, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ ఎల్ అండ్ టీ కంపెనీ మేడిగడ్డ బ్యారేజి నిర్మించిందన్నారు. మూడు సంవత్సరాలు గడిచినా తుమ్మిడిహెట్టి బ్యారేజి పెంచకపోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యం, అసమర్థత అని పేర్కొన్నారు. కేసిఆర్ ను దోషిగా చూపించాలనే కుట్ర తప్పితే రైతాంగ సంక్షేమం ఎక్కడ ఆలోచన లేదని, ఇప్పటివరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైడ్రా తో ఉన్న ధనవంతుల ఆక్రమణలను వదిలి, కేవలం పేదవారి ఇండ్ల పై చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. ప్రతి పక్షాలు ఎంత బలంగా ఉంటే, పాలక పక్షం అంత సమర్థంగా పనిచేస్తుందనీ, ఇప్పటికైనా కండ్లు తెరచి మేడిగడ్డ ఉపయోగంలోకి తెచ్చేందుకు రేవంత్ రెడ్డి ఆలోచించుకోవాలన్నారు. రేవంత్ కళ్ళు మూసుకుంటే, కేసిఆర్ కలలోకి వస్తాడిని, బలహీన వర్గాల బిడ్డలు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే సిరిసిల్ల ను అగ్రగామిగా నిలబెట్టేందుకు కేటిఆర్ కృషిచేశారని జీవన్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో నాఫ్స్ క్యాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి , బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ న్యాలకొండ అరుణ, జిల్లా కార్యదర్శి మ్యాన రవి, కుంబాల మల్లారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- రైతులు సన్నరకం వడ్లు సాగు చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లెలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో పరిశీలన



**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర అందుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లె గ్రామంలో ఐకేపీ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో కల్పించిన వసతులను పరిశీలించారు. ఎంత ధాన్యం వస్తుందని, గన్ని బ్యాగ్స్ పై నిర్వాహకులను ఆరా తీశారు. ధాన్యం తేమ శాతం పరిశీలించారు. హమాలీలు ఎందరు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో అన్ని వివరాలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని ప్యాడీ క్లీనర్ తో శుభ్రం చేయించాలని సూచించారు. టార్పాలిన్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం అన్ని వసతులు కల్పించాలని సూచించారు. కేటాయించిన మిల్లులకు ధాన్యం తరలించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రానున్న సీజన్ లో రైతులు సన్నరకం వడ్లు సాగు చేయాలని పిలుపు నిచ్చారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. పరిశీలనలో జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, తహసీల్దార్ విజయ్ ప్రకాశ్ రావు, ఏపీఎం, ఏవో తదితరులు పాల్గొన్నారు.

# బ్లడ్ గ్రూప్ వేరైనా కిడ్నీ మార్పిడి సక్సెస్

- యశోద వైద్యుల అరుదైన రికార్డు!
- 346 శస్త్రచికిత్సలతో ఎంతోమందికి పునర్జన్మ
- కరీంనగర్‌లో డాక్టర్ జశ్వంత్ చల్లా వెల్లడి
- వయస్సుతో సంబంధం లేకుండా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్..
- డయాలసిస్ శాశ్వత పరిష్కారం కాదు



**ప్రజానావ, కరీంనగర్:** కిడ్నీ వ్యాధులతో బాధపడే రోగులకు వైద్య రంగంలో సరికొత్త ఆశలు చిగురిస్తున్నాయి. సాధారణంగా కిడ్నీ మార్పిడికి రక్త గ్రూపులు కలవడం తప్పనిసరి అనే నిబంధనను పక్కన పెట్టి, భిన్నమైన బ్లడ్ గ్రూపులు ఉన్న వారికి కూడా విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించి యశోద హాస్పిటల్స్ బృందం అరుదైన రికార్డు సృష్టించింది. గురువారం కరీంనగర్ యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ జశ్వంత్ చల్లా ఈ వివరాలను వెల్లడించారు.

### 346 కుటుంబాల్లో వెలుగులు

యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ యూనిట్ ఇప్పటి వరకు 346 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను అత్యంత విజయవంతంగా పూర్తి చేసిందని డాక్టర్ జశ్వంత్ తెలిపారు. "ఈ 346 ట్రాన్స్‌ప్లాంట్లు కేవలం సంఖ్య మాత్రమే కాదు, 346 కుటుంబాల్లో నిండిన వెలుగులు. కిడ్నీ వైఫల్యంతో బాధపడేవారికి డయాలసిస్ అనేది కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే. కిడ్నీ మార్పిడి ద్వారానే వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారుతారు" అని ఆయన పేర్కొన్నారు. రక్త గ్రూపులు వేరైనా కిడ్నీ మార్పిడి సాధ్యమే అన్న అవగాహన ప్రజల్లో పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

### వయస్సు అడ్డంకి కాదు

వైద్య రంగంలో వయోభారంతో సంబంధం లేకుండా శస్త్రచికిత్సలు చేయవచ్చని యశోద వైద్యులు నిరూపించారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు సైతం కిడ్నీ మార్పిడి చేసి వారి ఆయుష్షును పెంచడంలో విజయం సాధించామని జశ్వంత్ చల్లా వివరించారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలు, నిష్ణాతులైన వైద్య బృందం అందుబాటులో ఉండటం వల్ల క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా అంతర్జాతీయ స్థాయి చికిత్సలను అందించగలుగుతున్నట్లు తెలిపారు.

### ముందస్తు జాగ్రత్తలే కీలకం

డయాబెటిస్ (మధుమేహం) ఉన్నవారు కిడ్నీల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వ్యాధి నిర్ధారణ అయినప్పటి నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి క్రియాటిన్, మూత్ర పరీక్షలు చేయించుకోవడం ద్వారా కిడ్నీల స్థితిగతులను తెలుసుకోవచ్చని చెప్పారు. దేశంలోనే అత్యుత్తమ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌గా ఎదుగుతున్న యశోద హాస్పిటల్స్, బాధితులకు పునర్జన్మ ప్రసాదించే దిశగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తోందని హర్షం వ్యక్తం చేశారు.




# గోడ కూలి ఒకే ఇంటిలోని ఆరుగురికి గాయాలు

**ఇద్దరు అమ్మాయిల పరిస్థితి విషమం.. కరీంనగర్ ఆసుపత్రికి తరలింపు**

**ప్రజానావ, సిరిసిల్ల :** ఈదర గాలుల బీభత్సానికి సిరిసిల్ల లోని 17 వ వార్డు గాంధీనగర్ మార్కెట్ రోడ్ లో గల నాలుగు అంతస్తుల భవనం గోడ కూలి పక్కన ఉన్న రేకుల ఇంటి పైన పడడంతో ఇంటిలో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఇద్దరు అమ్మాయిల పరిస్థితి తీవ్రంగా ఉండడంతో వారిని కరీంనగర్ కి తరలించారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి అనంతరం ఏరియా ఆస్పత్రికి వెళ్లి గాయాలపాలైన కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.

# తహసీల్దార్ కుటుంబానికి పరామర్శ

**ప్రజానావ, జమ్మికుంట:** జమ్మికుంట మండల తహసీల్దార్ నల్ల వెంకట్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి దశదిన కర్మ గురువారం వారి స్వగ్రామంలో జరుగగా, పలువురు ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు కలిసి పరామర్శించారు. అనంతరం నారాయణ రెడ్డి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నారాయణ రెడ్డి మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురేందర్ రావు, సర్పంచులు తోట కవిత - లక్ష్మణ్, బిసిగిరి సర్పంచ్ రాజయ్య, తనుగుల మాజీ సర్పంచ్ రామస్వామి, జమ్మికుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నర్సిని శ్రీనివాస్, ఎండీ నసీరుద్దీన్ తదితరులు ఉన్నారు.

# నేడు రుద్రంగి పోలీస్ స్టేషన్ భవనానికి శంకుస్థాపన

**హాజరుకానున్న డీజీపీ శివధర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**



**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. మండల కేంద్రంలో నిర్మించనున్న నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి డీజీపీ శివధర్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజ చేయనున్నారు. ఈ మేరకు గురువారం సాయంరం ఎస్పీ మహేష్ బి గితే రుద్రంగి గ్రామాన్ని సందర్శించారు. అధికారులతో కలిసి భవన నిర్మాణ స్థలాన్ని, సభా వేదిక, ఇతర ఏర్పాట్లను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అత్యాధునిక హంగులతో ఈ నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమం విజయవంతం చేసేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ శ్రీనివాసులు, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ రమేష్‌తో పాటు ఎస్సైలు మోతీరాం, రమేష్, యాదగిరి, పోలీస్ హౌసింగ్ బోర్డు ఏఈ రాజశేఖర్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఉదయం జరగనున్న ఈ కార్యక్రమానికి భారీగా బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు.

# వేసవి సెలవుల్లో జాగ్రత్తలు చేపట్టాలి



**ప్రజానావ, సిరిసిల్ల :** వేసవి సెలవుల్లో వడదెబ్బ తాకకుండా విద్యార్థులు తగిన రక్షణ చేపట్టాలని, చిన్నచిన్న పనులలో తల్లిదండ్రులకు సహాయ పడాలని ఖాళీ సమయాన్ని, సెలవులను డ్రాయింగ్, కథలు చదవడం, డాన్స్ నేర్చుకోవడం, క్రాఫ్ట్ నేర్చుకోవడం వంటి అంశాలలో శిక్షణ పొందాలని సిరిసిల్ల నెహ్రూ నగర్ మండల పరిషత్ పాఠశాల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం పిలుపునిచ్చింది. గురువారం పిటీఎం సమావేశం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసాల హరిప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలను ప్రధానోపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నందిని, లావణ్య, వేద ప్రకాష్ జోషి, లక్ష్మీనరసింహస్వామి లు మాట్లాడుతూ ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అలాగే స్థానిక కౌన్సిలర్ దూడం రజని శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కొరకు తోడ్పాటు అందిస్తానని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని సూచించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు బాగున్నాయని, ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులందరికీ ప్రగతి పత్రాలను అందజేసి, ఎస్ ఏ -2 లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.

